## తెలంగాణకు న్యాయం చేయలేదు



హుస్నాబాద్, జూలై 23 : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం చేయలేదు. ఒక రకంగా చెప్పాలంటే బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి చూపించినట్లే. ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ కోచ్‌ఫ్యాక్టరీ మంజూరుకు నిధులు తేలేక పోయారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటు, ఎయిమ్స్‌లాంటి వైద్య కళాశాల కేటాయించకపోవడం, తెలంగాణకు ఉపయోగపడే రిజర్వాయర్లకు జాతీయ హోదా కల్పించక పోవడం బాధాకరం. ఏపీకి అధిక ప్రాధాన్యత ఇచ్చి తెలంగాణను విస్మరించడం సవతి తల్లి ప్రేమగా అనుకోవచ్చు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్రమంత్రిగా ఉన్న బండి సంజయ్ ప్రత్యేక నిధులను బడ్జెట్‌లో కేటాయించేలా కృషి చేయక పోవడం ఆలోచించదగిన విషయం. రాబోయేరోజుల్లోనైనా ఇద్దరు కేంద్రమంత్రులు, ఎంపీలు కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తెచ్చి పరిశ్రమలు, విద్యాసంస్థల ఏర్పాటుకు కృషి చేయాలని ఆశిద్దాం.

**-పందిల్ల శంకర్, స్ఫూర్తి అసోసియేషన్ హుస్నాబాద్, సిద్దిపేట జిల్లా**


# నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I హైదరాబాద్, బుధవారం 24 జూలై 2024 SIDDIPET


## ఆదుకుంటాడనుకుంటే ఆగం జేసిండు..



సంగారెడ్డి,జూలై 23(నమస్తే తెలంగాణ) : మాకు వ్యవసాయమే జీవనాధారం. మాకు కొత్లాపూర్‌లో రెండున్నర ఎకరాల పొలం ఉంది. నాకు భార్య తారమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నరు. రెండున్నర ఎకరాల భూమి సాగు చేసుకుంటూ బతుకుతున్న. నా భార్యతో పాటు చదువు పూర్తి చేసుకున్న పెద్ద కొడుకు రాజేశ్ పొలంలో పనిచేస్తాడు. చిన్నకొడుకు శేఖర్ ఆరో తరగతి చదువుతున్నాడు. రోజంతా పొలంలో కష్టపడుతూ పంటపై వచ్చే డబ్బులతోనే కుటుంబాన్ని సాకుతున్నా. పొలంలో పనిలేనప్పుడు నా భార్య కూలీ పనులకు పోతుంది. రేవంత్‌రెడ్డి సీఎం కాగానే పంట రుణమాఫీ చేస్తాడని ఖుషీ అయిన. నేను మా పెళ్లాం పిల్లలకు మన బ్యాంకు లోన్ మాఫీ అయితదని చెప్పినా...ఇప్పుడు చూస్తే రేవంత్‌రెడ్డి గవర్నమెంట్ నా బ్యాంకులోన్ రూ.82వేలు మాఫీ చేయలేదు. రేవంత్‌రెడ్డి రెండు లక్షల వరకు పంటరుణమాఫీ చేస్తానని జెప్పిండు, నాకు ఉన్నది రూ.82వేల బ్యాంకు అప్పు. అయినా లోన్ ఎందుకు మాఫీ కాలేదో తెల్వటం లేదు. రుణమాఫీ కాలేదని తలుచుకుంటుంటే కళ్లలోనీళ్లు తిరుగుతున్నయి. రుణమాఫీ కాకపోతే నేడు ఎప్పటికీ లోన్ డబ్బులు కట్టలేను. ఉన్న రెండు ఎకరాల పొలంలో పత్తివేసిన. వర్షాలు లేక పత్తి మొక్కలు లేవనేలేదు. వానకాలం సాగు కలిసిరాలేదు. పత్తిసాగుకు రూ.40వేలకు పైననే ఖర్చు పెట్టినా. కేసీఆర్ సర్కార్ మంచిగుండే. పంట వేయకుముందే రైతుబంధు డబ్బులు చేతికివచ్చేటివి. ఆ డబ్బులతో పంట సాగుచేసుకునేటోన్ని. ఇప్పుడు రైతుబంధు డబ్బులు రాలేదు, పంటరుణమాఫీ కాలేదు. రేవంత్‌రెడ్డి సర్కారులో నాలాంటి రైతుల పరిస్థితి ఆగమే ఉంది. నా గోస చూసి ప్రభుత్వం, అధికారులు ఎలాగైనా రుణమాఫీ అయ్యేలా చూడాలని కోరుతున్నా.

**-బేగరి మల్కయ్య, రైతు, కొత్లాపూర్ గ్రామం, (సంగారెడ్డి జిల్లా)**

# మొండిచేయి



పార్లమెంట్ భవన్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్

- నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్
- ఉమ్మడి మెదక్ జిల్లాకు నిధులేవీ..
- కొత్త రైల్వే ప్రాజెక్టులు, మెట్రో ప్రస్తావన లేదు..
- నిమ్జ్‌కు పైసా నిధులు కేటాయించని కేంద్రం
- ఆర్ఆర్ఆర్‌కు ఆర్థిక సాయం కరువు
- కేంద్రం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

సంగారెడ్డి, జూలై 23(నమస్తే తెలంగాణ) : కేంద్రం బడ్జెట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాకు మొండి చేయి దక్కింది. మంగళవారం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది.ఈ బడ్జెట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. మెదక్ ఎంపీగా బీజేపీ అభ్యర్థిని గెలిపించినా కేంద్రం ఎలాంటి నిధులు ఇవ్వలేదు. దీంతో ప్రజలు మోడీ ప్రభుత్వం తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై ఉమ్మడి మెదక్ జిల్లా వాసులు పెద్దగానే ఆశలు పెట్టుకున్నారు. కానీ, ఎలాంటి భారీ నిధులు కేటాయించలేదు. ముఖ్యంగా కొత్త రైల్వేలైన్‌లు, రైల్వేలైన్ల ఆధునీకరణకు నిధులు కేటాయిస్తారని ప్రజలు ఆశించారు. వట్టినాగులపల్లి-జోగిపేట-మెదక్ నూతన రైల్వేలైన్ కోసం జిల్లా ప్రజలు ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్నారు. కానీ, ఈ బడ్జెట్‌లో దీనిపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు మెట్రోరైల్ విస్తరణ చేపట్టాలనే డిమాండ్ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రోరైల్ విస్తరణ చేపడతామని ఇది వరకే ప్రకటించింది. మెట్రోరైల్‌ను సంగారెడ్డి వరకు పొడిగించాలని సంగారెడ్డి ప్రాంత ప్రజల డిమాండ్ చేస్తున్నారు. ప్రతిరోజు సంగారెడ్డి నుంచి హైదరాబాద్‌కు వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో మెట్రోను సంగారెడ్డి వరకు విస్తరించాలని కోరుకుంటున్నారు. ఇటీవల బీజేపీ నుంచి ఎంపీగా ఎన్నికైన రఘునందన్ రావు సంగారెడ్డి వరకు మెట్రో విస్తరణకు హామీ ఇచ్చారు. కానీ, కేంద్రం మెట్రో విస్తరణ ఊసెత్తలేదు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మిస్తున్న రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 110 కిలోమీటర్ల మేర ఆర్ఆర్ఆర్‌ను నిర్మించనున్నారు. ఆర్ఆర్ఆర్ భూసేకరణ, నిర్మాణ పనులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించలేదు. సికింద్రాబాద్-జహీరాబాద్ రైల్వేలైన్ డబ్లింగ్ చేయాలని, జహీరాబాద్‌లో రేక్ పాయింట్ ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్ ఉన్నా కేంద్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని నిమ్జ్‌కు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయింపులు జరపలేదు. మెదక్ జిల్లాలోని అక్కన్నపేట, మిర్జాపల్లి, వడియారం రైల్వేస్టేషన్ల ఆధునీకరణ, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని ప్రజలు ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్నా కేంద్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. కందిలోని ఐఐటీ హైదరాబాద్‌కు ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారు. ఈసారి ఐఐటీ హైదరాబాద్‌కు ఎక్స్‌ట్రీమ్లీ ఎయిడెడ్ ప్రాజెక్టు(ఈఏపీ) కింద కేంద్రం రూ.122 కోట్ల నిధులను కేటాయించింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.522 కోట్ల నిధులు కేటాయించిన కేంద్ర,ఈసారి రూ.122 కోట్లతో సరిపెట్టింది.

## ఎందుకు లోన్ మాఫీ కాలేదో అర్థమైతలేదు..



సిద్దిపేట రూరల్, జూలై 23 : మాఊరు సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్. ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రూ.50 వేల పంట రుణం తీసుకున్న.వడ్డీతో కలిపి రూ.60 వేలు అయ్యింది. మొదటి విడత లక్ష రూపాయలలోపు రుణం కాంగ్రెస్ సర్కారు మాఫీ చేసిందని తెలిసి సంబురపడ్డ. లోన్ మాఫీ విషయం తెలుసుకుందామని బ్యాంకుకు పోయిన. నాలోన్ మాఫీ కాలేదని బ్యాంకోళ్లు చెప్పడంతో ఖంగుతిన్న. నా పంట లోన్‌ను బ్యాంకు నిబంధనల మేరకు రెన్యువల్ కూడా చేయించిన. అయినా నాలోన్ మాఫీ కాలేదు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే, మరో జాబితాలో అస్తదని చెప్పిరు. మొదటి జాబితాలో ఎందుకు లోన్ మాఫీ కాలేదని విషయంపై సరైన సమాధానం రాలేదు. నాది లోన్ ఎందుకు మాఫీ కాలేదో అర్థంకావడం లేదు. చాలా బాధగా ఉంది. కాంగ్రెస్ సర్కారు నాకు న్యాయం చేయాలి.

**-దగ్గుల రాజు, రైతు,రాఘవాపూర్ (సిద్దిపేట జిల్లా)**

## పేదల వ్యతిరేక బడ్జెట్



సిద్దిపేట జూలై 23: పార్లమెంట్‌లో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలు, మధ్యతరగతి ప్రజలపై భారం వేసి కార్పొరేట్ శక్తులను సంతృప్తిపర్చేవిధంగా ఉన్నది. ఇది పూర్తిగా పేదలకు వ్యతిరేకమైన బడ్జెట్. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రజాసమస్యలను పక్కకు పెట్టి కేవలం కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం తగదు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆహార భద్రతకు గ్యారెంటీ కల్పించలేదు. ఉపాధి హామీ పథకానికి గత సంవత్సరం కేటాయించిన రూ. 86 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలి. ప్రజా అనుకూల బడ్జెట్‌ను రూపొందించాలి.

**-ఆముదాల మల్లారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి, సిద్దిపేట జిల్లా**

## ఉద్యోగులకు తీవ్ర నిరాశే



సిద్దిపేట, జూలై 23 : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగులకు తీవ్ర నిరాశే మిగిలింది. పదేండ్ల నుంచి ఆదాయ పన్ను పరిమితి పెంచకపోవడం, దీనికి తోడు కొత్త , పాత పన్ను విధానం తీసుకువచ్చి ఉద్యోగులను పూర్తి డైలామాలో పడేశారు. కేంద్రం కేవలం ఉద్యోగుల నుంచి పన్ను వసూలు చేయాలనే ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నట్లు కనిపిస్తున్నది. ఉద్యోగుల పట్ల కేంద్రం మొండి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆదాయ పన్ను స్లాబ్‌లు పెంచాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌కు వినతి పత్రం అందించినా ప్రయోజనం లేదు.

**-కోమండ్ల విక్రంరెడ్డి, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి, సిద్దిపేట జిల్లా**

## తెలంగాణపై కేంద్రం వివక్ష



గజ్వేల్, జూలై 23 : కేంద్రం కేటాయించిన బడ్జెట్‌లో తెలంగాణకు వివక్ష చూపింది. ఉపాధి హామీ పథకానికి తక్కువ నిధుల కేటాయింపు బాధాకరం. కేంద్రం కేటాయించిన బడ్జెట్‌లో గతంతో పోల్చితే రూ.19,300కోట్లు తక్కువగా కేటాయించారు. గత సంవత్సరం కంటే మొదటి మూడు నెలల్లోనే రూ.5.74 కోట్ల పనిదినాలు జరిగాయి. పనిదినాల ప్రకారం బడ్జెట్ కేటాయింపులు జరగకపోవడం కూలీల పొట్టకొట్టడమే. రూ.48 లక్షల 21వేల కోట్లతో కేంద్రం బడ్జెట్ ప్రవేశపెడితే తెలంగాణకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదు. బడ్జెట్‌లో ఏపీ, బీహార్ మినహాహిస్తే మిగతా 26 రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం తగదు.

**- దాసరి ఎగొండస్వామి,డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి**

## ఉద్యోగ వర్గాలకు లాభం లేదు



మెదక్ మున్సిపాలిటీ, జూలై 23: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగ వర్గాలకు లాభం లేదు. ఇన్‌కమ్‌ట్యాక్స్ పాత విధానంలో మార్పు చేయకపోవడం నిరాశపర్చింది. మధ్యతరగతి, వేతన జీవులకు సైతం పెద్దగా లాభం చేకూర్చే విధంగా లేదు. ఇంతకు ముందు రూ. 2.50 లక్షల వరకు జీరో పన్ను ఉండేది. కానీ కొత్త ఐటీ విధానంలో రూ.3 లక్షల వరకు ఉండటం, స్టాండర్డ్ డీడక్షన్ రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు పెంచడం కొంత మేరకు ఊరట కలిగిందని చెప్పవచ్చు.

**-మల్లారెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, మెదక్ జిల్లా**

## కేంద్ర బడ్జెట్‌లా లేదు



సిద్దిపేట టౌన్, జూలై 23 : పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కేంద్ర బడ్జెట్‌లా లేదు. బీహార్, ఏపీ రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరేలా రూపొందించినట్లుగా ఉన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కేంద్రంతో కొట్లాడి నిధులు సాధించింది. బీజేపీ కేంద్ర మంత్రులు,ఎంపీలు ఉన్నా రాష్ట్ర అభివృద్ధికి కావాల్సిన నిధులు తీసుకురాలేదు. పునర్విభజన చట్టంలో రెండు రాష్ట్రాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని స్పష్టంగా ఉన్నా బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్తావన లేకుం డా ఆంధ్రరాష్ట్రానికి నిధులు కేటాయించడం బాధాకరం.

**- కాంత్రికుమార్, చార్టర్డ్ అకౌంటెంట్ సిద్దిపేట**

## తెలంగాణకు తీరని అన్యాయం



చేర్యాల, జూలై 23 : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యా యం జరిగింది. బహుపాక్షిక అభివృద్ధి ఏజన్సీల ద్వారా బీహార్‌కు ఆర్థిక సాయం, ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్ల సాయం చేస్తున్నట్లు ప్రకటించి తెలంగాణకు కనీసం ఒక్క ఐఐఎం కేటాయించకపోవడం విచారకరం. కేంద్ర ప్రభుత్వ అలయన్స్‌లో ఉన్నారు కాబట్టే బీహార్, ఏపీకి సాయం చేస్తే ఇది దేశానికే ప్రమాదం. మన రాజకీయ వ్యవస్థలోనే లోపా లు ఉన్నాయి. ఎవరు అధికారంలో ఉన్నా ఇదే పద్ధతి కొనసాగించడం సరికాదు. దేశంలోని అన్ని ప్రాం తాలు అభివృద్ధి సాధించేలా బడ్జెట్ ఉండాలి.

**-ఆలేటి రమేశ్, విద్యార్థి నాయకుడు, చేర్యాల, సిద్దిపేట జిల్లా**

## నిధులు కేటాయించలేదు



బెజ్జంకి, జూలై 23 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్రం నిధులు కేయించకపోవడం బాధాకరం. విభజన చట్టం ప్రకారం ఏపీకి భారీగా నిధులు ఇచ్చి తెలంగాణకు ఇవ్వకపోవడం సరికాదు.

**-బండి రమేశ్, ప్రాథమిక సహకార సంఘం వైస్ చైర్మన్ బెజ్జంకి, సిద్దిపేట జిల్లా**



మెదక్ జిల్లా హవేళీఘనాపూర్ మండలం బూర్గుపల్లి ఎస్‌బీఐలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

## అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ అందాలి

### మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, జూలై 23 (నమస్తే తెలంగాణ) : అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ అందాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. పంటరుణమాఫీ సమస్యలను నివృత్తి చేసుకోవడానికి ప్రతి మండల కేంద్రంలో బ్యాంకుల వద్ద వ్యవసాయాధికారులతో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం సంబంధిత లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో కలిసి మెదక్ జిల్లా హవేళీఘనపూర్ మండలం బూర్గుపల్లి ఎస్‌బీఐ బ్రాంచ్ వద్ద పంటరుణమాఫీ పథకం అమలు తీరును క్షేత్రస్థాయిలో కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూర్గుపల్లి ఎస్‌బీఐలో 391 అకౌంట్లు ఉన్నాయని, ఇప్పటివరకు 367 మంది రైతులకు పంటరుణమాఫీ వర్తించిందన్నారు. పంటరుణ మాఫీపై క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను తెలుసుకుని చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడత లక్షలోపు ఉన్న 47,978 మంది రైతులకు వివిధ బ్యాంకుల ద్వారా రూ.23 8.81 కోట్లు విడుదల చేయగా అందులో47,616 మంది రైతుల ఖాతాల్లో 237.5 కోట్లు జమచేసినట్లు తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల 362 మంది రైతులకు సంబంధించి రూ.1.3 కోట్లు జమకావాల్సి ఉందన్నారు. సంబంధిత రైతులకు పంట రుణమాఫీ సొమ్ము చేరేలా బ్యాంకు అధికారులు వ్యవసాయాధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటరుణమాఫీ ప్రక్రియ పూర్తి చేయాలని బ్యాంకు మేనేజర్లు, వ్యవసాయాధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింహమూర్తి, బూర్గుపల్లి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

## లాస్యనందిత దూరంకావడం బాధాకరం



అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, జూలై 23 : కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్యనందిత తమ నుంచి దూరం కావడం బాధాకరమని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి విచారం వ్యక్తం చేశారు. లాస్యనందిత మృతికి మంగళవారం అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి సంతాప తీర్మా నం ప్రవేశపెట్టగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలిసారిగా అసెంబ్లీకి ఎన్నికైన లాస్యనందిత మృతి చెందడం బాధాకరమన్నారు. తండ్రి సాయన్న ఆశయాలు నెరవేర్చాలని ఆమె రాజకీయ రంగ ప్రవేశం చేశారని గుర్తుచేశారు. ప్రజాసేవలో భాగంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. అతి చిన్న వయస్సులోనే శాసనసభలో అడుగుపెట్టిన ఆమెకు పెద్దలంటే ఎంతో గౌరవం ఉండేదన్నారు. లాస్యనందిత మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తూ ఆమె ఆత్మకు శాంతిచేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## తెలంగాణపై చిన్నచూపు



సంగారెడ్డి, జూలై 23 : పార్లమెంట్‌లో కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసింది. పదేండ్ల క్రితం విభజన అయిన కొత్త రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాల్సిన కేంద్రం పట్టించుకోలేదు. గత ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకే బీజేపీ కేంద్ర మంత్రులు కాలం గడిపారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు బీజేపీ ఎంపీలు ఉన్నా ఎందుకూ పనికిరాకుండా పోయారు. బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రస్తావన లేకపోవడం బాధాకరం.

**-చింతా ప్రభాకర్, సంగారెడ్డి ఎమ్మెల్యే**

## బీజేపీకి చిత్తశుద్ధిలేదు



నర్సాపూర్,జూలై 23: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. బడ్జెట్‌లో తెలంగాణకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడం దారుణం. సెంటిమెంట్‌తో ఓట్లు పొందిన బీజేపీకి తెలంగాణపై ఏ మాత్రం చిత్తశుద్ధి లేదు. సీట్లు, ఓట్లు తప్పా బీజేపీ ప్రభుత్వానికి తెలంగాణ పట్ల ప్రేమ లేదు. కులం, మతం, దేవుడి పేరుతో చేసిన రాజకీయాలు బీజేపీకి చెల్లుతాయి. పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలు తెలంగాణకు అధిక నిధులు కేటాయించేవిధంగా పోరాటం చేస్తారు.

**-ఆంజనేయులుగౌడ్, మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు**

## మొండి చేయి చూపడం బాధాకరం



తొగుట, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ప్రధాని మోదీ సర్కారు మొండి చేయి చూపడం బాధాకరం. ఆంధ్రప్రదేశ్‌కు పెద్ద ఎత్తున నిధులు కేటాయించిన కేంద్రం తెలంగాణకు అన్యాయం చేసింది. విభజన చట్టంలో భాగంగా తెలంగాణలోని వెనుకబడిన తొమ్మిది జిల్లాలకు ఎలాంటి కేటాయింపులు చేయలేదు. బయ్యారం ఉక్కు గనులు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు ఊసే లేదు. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీలు అధిక నిధుల కోసం పోరాటం చేయాలి. మొదటి నుంచి తెలంగాణపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మొండి చేయి చూపిస్తున్నది.

**-జీడిపల్లి రాంరెడ్డి, బీఆర్ఎస్ తొగుట అధ్యక్షుడు, సిద్దిపేట జిల్లా**

# గ్రామంలో బతకాలా.. చావాలా

- విష వాయువులతో బతకలేక పోతున్నాం
- ఇప్పుడు డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తారా..
- అడ్డుకున్న గుండ్లమాచునూర్ గ్రామస్తులు
- మంత్రి కార్యక్రమాన్ని రద్దుచేసిన అధికారులు



మంగళ వారం డంపింగ్‌యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న గుండ్లమాచునూర్ గ్రామస్తులు



శిలాఫలకం ఏర్పాటుకోసం నిర్మించిన గద్దెపనులు మధ్యలో నిలిపివేసిన దృశ్యం

హత్నూర, జూలై 23 : ఇప్పటికే పరిశ్రమల కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మళ్లీ గ్రామ శివారులో డంప్‌యార్డు ఏర్పాటును నిరసిస్తూ మంగళవారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి... పరిశ్రమల నుంచి విడుదలయ్యే ఘాటైన పొగమంచు, వాయుకాలుష్యంతో గుండ్లమాచునూర్ గ్రామస్తులు జబ్బులకు గురవుతున్నారు. దవాఖానల చుట్టూ తిరుగుతున్నారు. వాయుకాలుష్యం బాధలు భరించలేక కొంతమంది గ్రామస్తులు ఊరువిడిచి ఇతర ప్రాంతాలకు వెళ్లి బతుకుతున్నారు. ఇది చాలదు అన్నట్లుగా అధికారులు గ్రామసమీపంలో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో గ్రామస్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. గండ్లమాచునూర్ సమీపంలోని కందిమండలం ఆరుట్ల గ్రామశివారులో సర్వే నెంబర్ 133లో సంగారెడ్డి మున్సిపాలిటీ చెత్త నిల్వకోసం అధికారులు డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం పనులు ప్రారంభించారు. నేలను చదునుచేసి మంత్రి దామోదర రాజనరసింహ చేతులమీదుగా మంగళవారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో విషయం తెలుసుకున్న గ్రామస్తులు సోమవారం పనులు అడ్డుకోవడంతో అధికారులు వెనుదిరిగారు. మంగళవారం ఉదయం కంది, హత్నూర మండలాల తహసీల్దార్లతో పాటు సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్, పోలీసు సిబ్బంది గుండ్లమాచునూర్ గ్రామానికి చేరుకొని ప్రజలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. గ్రామశివారులోని రసాయన పరిశ్రమలతో ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ గ్రామంలో ఉండలేకపోతున్నామని, ఇక డంపింగ్‌యార్డు నిర్మాణం చేపడితే గ్రామంలో ఎలా బతకాలని ప్రశ్నించారు. రసాయన పరిశ్రమలు విడుదలచేసే విషపూరిత కాలుష్యం భరించలేక కొన్ని కుటుంబాలు గ్రామం విడిచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయాయని, ఇక మమ్మల్ని కూడా వెళ్లిపొమ్మంటారా లేక చావమంటారా ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో చేసేది ఏమిలేక వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

### డంపింగ్‌యార్డును అడ్డుకుంటాం..



గ్రామ సమీపంలో డంపింగ్‌యార్డు ఏర్పాటును గ్రామస్తులు అందరం కలిసి అడ్డుకున్నాం. 15 కిలోమీటర్ల దూరం నుంచి తీసుకువచ్చి మాగ్రామ సమీపంలో చెత్తవేయాల్సిన అవసరం ఏముంది. సంగారెడ్డి మున్సిపాలిటీ చెత్తను సంగారెడ్డి సమీపంలోనే వేయాలి తప్ప ఇతర గ్రామాలకు ఇబ్బంది కలిగేలా చూడటం పద్ధతికాదు. ఇప్పటికే విషపూరిత వాయుకాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎట్టి పరిస్థితిల్లో డంప్‌యార్డును ఏర్పాటు చేయనివ్వం.

**-బేగరి యాదగిరి, మాజీ వార్డుమెంబర్, గుండ్లమాచునూర్**


### ఇక చావా శరణ్యం..



మాగ్రామంలో ఇప్పటికే పరిశ్రమలు విడుదల చేస్తున్న విషపూరిత కాలుష్యంతో రోగాల బారినపడుతున్నాం. ఎప్పుడూ ఎవరో ఒకరు అనారోగ్యానికి గురై దవాఖానల చుట్టూ తిరుగుతున్నాం. ఘాటైన వాసన భరించ లేకపోతున్నాం. మా సమస్యలు పట్టించుకునే వారు కరువయ్యారు. ఇక సంగారెడ్డి మున్సిపాలిటీ చెత్తను తీసుకువచ్చి గ్రామ సమీపంలో వేయడానికి అధికారులు చర్యలు తీసుకోవడం బాధ కలిగిస్తుంది. ఎట్టి పరిస్థితిలో డంపింగ్‌యార్డు ఏర్పాటు కానివ్వం.

**-శ్రీశైలం, గుండ్లమాచునూర్, గ్రామ యువకుడు**

### వేరేచోట ఏర్పాటు చేసుకోవాలి..



సంగారెడ్డి మున్సిపాలిటి చెత్తను తీసుకువచ్చి మాగ్రామ సమీపంలో పారబోసే చర్యను అధికారులు మానుకోవాలి. డంపింగ్ యార్డు వేరేచోట ఏర్పాటు చేయాలి. డంపింగ్ యార్డు ఏర్పాటుచేస్తే రెండుగ్రామాల ప్రజలం ఇబ్బందులు ఎదుర్కొంటాం. అధికారులు పునరాలోచన చేసి డంపింగ్ యార్డు ఏర్పాటును మానుకోవాలి. లేనిపక్షంలో రెండుగ్రామాల ప్రజలు అందరం కలిసి నిరవధిక ఆందోళనకు వెనుకాడం.

**-నరసింహారెడ్డి,మాజీ ఉప సర్పంచ్, గుండ్లమాచునూర్**